హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడితే సహించేది లేదు
- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్

ఖానాపూర్, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ స్పష్టం చేశారు. ఉట్నూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్ష సాధింపు చర్యగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీస్తే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తారా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నోటి దురుసుతో ప్రజలు విసుగు చెందుతున్నారని, ఎన్నికల హామీల అమలును పక్కదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులపై దాడులు, కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. హామీల అమలులో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడంతో అనేక మంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ అడుగుజాడల్లో బీఆర్ఎస్ నాయకులు రైతు పక్షపాతిగా ఉంటూ అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటూ ప్రజల కోసం పోరాడుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజగంగన్న, ప్రదీప్, వాల్‌సింగ్, రమేశ్, సుమన్, శ్రావణ్, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

పది రోజుల పాటు శిక్షణ ప్రారంభం

ఎదులాపురం, అక్టోబర్ 16 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో 32 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ పది రోజుల ఇన్‌స్టిట్యూషనల్ శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ పీఐ సిబ్బంది సుర్జిత్ సింగ్, నరేశ్ కుమార్ కెడెట్లకు డ్రిల్ , శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిఖ్‌బేగం, ఎన్‌సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, శ్రీనివాస్, కెడెట్లు పాల్గొన్నారు

29లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, అక్టోబర్ 16 : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎస్సీడీవో భగత్ సునీతా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఈ పాస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8886976630 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

ఎదులాపురం, అక్టోబర్ 16 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీబీసీడీవో కే రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వాల్మీకి బోయ నాయకులు, బీసీ సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

19న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

నిర్మల్‌అర్బన్, అక్టోబర్ 16 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 19వ తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశాలకు తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఆహ్వానించాలని పాఠశాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా తల్లిదండ్రులకు సూచించాలన్నారు.

లోకోస్ డాటాను పూర్తి చేయాలి

జైనథ్, అక్టోబర్ 16 : స్వయం సహాయక సంఘాల సభ్యులు లోకోస్ డాటాను గడువులోగా పూర్తి చేయాలని ఐకేపీ డీపీఎంలు శోభ, శోభారాణి సూచించారు. మంగళవారం జైనథ్‌లోని ఇందిరమ్మ మండల కార్యాలయంలో నిర్వహిస్తున్న లోకోస్ డాటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెర్ప్ ద్వారా నిర్వహించే ప్రతి కాంపోనెంట్‌లను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. సమావేశంలో ఏపీఎం భగవాండ్లు, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల ఎంపికకు గ్రామసభలు

సోన్, అక్టోబర్ 16 : నిర్మల్ మండలంలోని నీలాయిపేట్, వెంగ్వాపేట్, అనంతపేట్, మేడిపెల్లి గ్రామాల్లో వచ్చే వేసవికాలం పనుల ఎంపికకు బుధవారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో తుల రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ గౌరి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 16 : నిర్మల్ జిల్లాలోని ఉన్నత పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్‌బీఐ ఆశా స్కాలర్‌షిప్‌కు www.sbifashaschol arship.org వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ ఆశా స్కాలర్‌షిప్ పేరిట సూపర్ 300 కింద 300 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. స్కాలర్‌షిప్ కింద ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ. 15000 నగదు బహుమతి అందించబడుతుందన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం

సారంగాపూర్, అక్టోబర్ 16 : సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బుధవారం అబ్బుల్ హాది బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు 15 మంది డైరెక్టర్లతో సెక్రటరీ ప్రమాణ స్వీకరం చేయించారు. అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకరం చేసిన చైర్మన్, సభ్యులతో స్వీకరం చేయించారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హిరాసుక్క ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నార్నూర్, అక్టోబర్16 : గాదిగూడలో హిరాసుక్క ఆలయ నిర్మాణానికి బుధవారం మాజీ ఎంపీపీ ఆడ చంద్రకళరాజేశ్వర్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు హెచ్‌కే పాండురంగ్, ప్రధాన కార్యదర్శి ఆత్రం వామన్, కోశాధికారి పరశురామ్, ప్రచార కార్యదర్శి వామన్, పర్ధాన్ సమాజ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

నార్నూర్,అక్టోబర్ 16: ఫర్టిలైజర్ దుకాణాల్లో నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జిల్లా అధికారి శ్రీధర్‌స్వామి వ్యాపా రస్తులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఇక్కడ వ్యాపారస్తులు సంతోష్ ఉన్నారు.

PUBLIC NOTICE

All the general public here by informed that **Sri. Ayitla Sudharshan S/o Nadipi Rajanna, Occ: Business, R/o H.no. 3-10/1, Chamanpelly village, R/M Laxmanchanda, Dist. Nirmal** intended to deposit his title deeds of the over the property of the M/s Sri Rama Agro Rice Mill constructed in land pertains to Sy.nos. 291/1/ఆ, 291/2ఆ & 292/1/2/2, admeasuring 21780 Sq. feet = 2420 Sq. yards = 2023.36 Sq. meters, in which non RCC shed plinth area 5141.75 Sq. feet situated at Chakpelly village & G.P., R/M Narsapur (G), Dist. Nirmal, Telangana State which is bounded by East: 40' wide road, West: land of Naveen Reddy, North: land of Mujju, South: land of vendor. At present **Sri. Ayitla Sudharshan** S/o Nadipi Rajanna is intended to create **EQUITABLE MORTGAGE** in favour of M/s. Shriram Finance Ltd., Branch: Bhainsa for the purpose of Small & Medium Enterprises loan.
As such if any person or persons have any interest or any other right or title over the said property can furnish their objections if any, for the said creation of mortgage, and if they have any claims with regard to title and have any documents related to the said property also can file and furnish the same at my office within a week days time from the publication of this notice. If any objections pertains to the said property raised after the said stipulated time, shall not be entertained and considered.
Hence this notice.
Sd/- J.KRISHNA MOHAN RAO, Advocate
H.No 1-3-458, Road No 2,Shastrinagar South Nirmal,Dist: Nirmal, Pin: 504108, Cell: No 9959298938

PUBLIC NOTICE

All the general public here by informed that **Sri. Katakam Rajeshwar S/o Datturam, Occ: Business, R/o H.no. 5-11-51/67, Priyadarshininagar Nirmal, Dist. Nirmal** intended to deposit his title deeds of the over the property of the plot nos. 70 (part), 80 (part), 81, 82 & 83 (part) in Sy.no. 438, total admeasuring 8101.67 Sq. feet 900.18 Sq. yards =752.64 Sq. meters situated at Mudhole village & G.P., R/M Mudhole, Dist. Nirmal, Telangana State which is bounded by East plot nos. 80 (part) and 83 (part), West: 30' wide road, North plot nos. 70 (part) and 80 (part), South: Abdullapur main road. At present **Sri. Katakam Rajeshwar S/o Datturam** is intended to create EQUITABLE MORTGAGE in favour of M/s. Shriram Finance Ltd., Branch: Bhainsa for the purpose of Small & Medium Enterprises loan.
As such if any person or persons have any interest or any other right or title over the said property can furnish their objections if any, for the said creation of mortgage, and if they have any claims with regard to title and have any documents related to the said property also can file and furnish the same at my office within a week days time from the publication of this notice. If any objections pertains to the said property raised after the said stipulated time, shall not be entertained and considered
Hence this notice.
Sd/- J.KRISHNA MOHAN RAO, Advocate
H.No 1-3-458, Road No 2,Shastrinagar South Nirmal,Dist: Nirmal, Pin: 504108, Cell: No 9959298938

పరీక్షా కేంద్రం తనిఖీ

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, అక్టోబర్ 16 : ఆదిలాబాద్‌లోని జిల్లా శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు రెండవ సెమిస్టర్ చివరి పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ గౌష్ ఆలం బుధవారం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. తొమ్మిది నెలల పాటు శిక్షణను తీసుకొని చివరి రాత పరీక్షలను రాస్తున్న 254 మంది శిక్షణ కానిస్టేబుళ్లకు నాలుగు రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఇక్కడ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సమయ్ జాన్ రావ్, నిజామాబాద్ సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్ఐ రాకేశ్, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని ఆహ్వానించిన ఆదివాసీ నాయకులు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 16 : ఉట్నూర్ మండలం తాటిగూడ గ్రామంలో ఈ నెల 19వ తేదీన ఆదివాసీ హక్కుల కోసం పోరాడి అమరుడైన కుమ్రం భీం విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వాన కమిటీ నాయకులు బుధవారం ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలంను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా ఎంపీ నగేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావ్‌లను కూడ ఆహ్వానించామని తెలిపారు. ఇక్కడ నాయకులు వెడ్మ కొద్దు, సిడాం గంగాధర్, చంద్రభాను ఉన్నారు.

ఎస్పీకి వినతి

కుభీర్, అక్టోబరు 16 : అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని బుధవారం కుభీర్ గ్రామస్తులు ఎస్పీ జానకి షర్మిలకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన ఒక వివాదంలో ఓ వర్గానికి చెందిన వారిని అక్రమంగా అరెస్టు చేసి కేసుల పెట్టారని దానికి నిరసనగా కుభీర్ మండల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ కుభీర్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విచారణ జరపకుండా కేసులు చేసి అరెస్టు చేయడం అన్యాయమని, కేసులను ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర, అక్టోబర్ 16 : బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ పలు అవినీతి ఆరోపణలు ఉన్నందున ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌తో పాటు బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ పదవి నుంచి రిలీవ్ చేసింది. బాసర ట్రిపుల్ ఐటీకి నూతన ఇన్‌చార్జి వీసీని నియమించడంతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

వాగులో ట్రాక్టర్ బోల్తా

ముథోల్, అక్టోబర్, 16 : ముథోల్‌లో ఖర్బాల దారి వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో చేతికి వచ్చిన పంట నీటి పాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలకు వెళ్లితే..ముథోల్‌కు చెందిన సాయినాథ్ అనే రైతు తన చేనులో సోయా పంటను కోసి 30 క్వింటాళ్ల సంచులను ఇంటికి తీసుకువచ్చే క్రమంలో వాగులో ట్రాక్టర్ బోల్తా పడింది. వాగుపై వంతెన నిర్మాణం లేకపోవడంతో ట్రాక్టర్ బోల్తా పడి పంట నీటి పాలైందని రైతు కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే జేసీబీ తెప్పించి వాగు నుంచి ట్రాక్టర్‌ను బయటకు తీయాల్సిన పరిస్థితి తలెత్తింది. 30 క్వింటాళ్ల సోయా నీళ్లలో తడిసిపోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

వాగులో బోల్తాపడిన ట్రాక్టర్ నీటి పాలైన సోయా పంట

విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

ఎదులాపురం, అక్టోబర్ 16 : జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించాలని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్–2లో జిల్లా స్థాయి జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఇందులో ఆయా పాఠశాలల విద్యార్థులు సైన్స్‌తో కూడిన నాటికలు ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు వారి ప్రతిభ ఆధారంగా రాష్ట్ర స్థాయికి విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్నాయి. సెమినార్‌కు సెఫ్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థి, డ్రామాలో జడ్పీఎస్ఎస్ లక్ష్మీపూర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సైన్స్ ఆఫీసర్ భాస్కర్, పాఠశాల హెచ్ఎం సుధాకర్, లక్ష్మీపూర్ హెచ్ఎం పోరెడ్డిఅశోక్, జైనథ్ హెచ్ఎం మద్ది లస్మన్న, జ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ రెడ్డి, మ్యూజిషియన్ రాజు, మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దిలావర్‌పూర్, అక్టోబర్ 16 : వరి, సోయా కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణ రెడ్డి అన్నారు. బుధవారం దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, ఏవో రాజశేఖర్, ఏఈవోలు శ్రీవాణి, మౌనిక, సహకార సంఘం డైరెక్టర్లు సురేశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు

ఉట్నూర్, అక్టోబర్16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుపై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేటీఆర్ గతంలో మూసీ నది ప్రాజెక్ట్ అవకతవకలపై, అవినీతిపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ గత నెల 30న కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిపుణుల న్యాయ సలహాలు తీసుకొని బీఎన్ఎస్ సెక్షన్ 352, 353(2),356(2) కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

ఎదులాపురం, అక్టోబర్ 16 : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్ఐ నజీబ్ తెలిపారు. కిన్వట్ తాలూకా కోబ్రా గ్రామానికి చెందిన ముండే జోష్న(36) కొద్ది నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నది. కడుపు నొప్పి భరించలేక మంగళవారం పంట చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. గమనించిన కుటుంబీకులు కిన్వట్ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స చేయించి రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 16 : గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, గ్రామ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో చిక్యాల రత్నకర్ రావు, ఎంపీవో రమేశ్, స్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాన్ని వదిలి... ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరి

దస్తురాబాద్, అక్టోబర్ 16 : సమాజానికి తమ వంతు సేవ చేయాలనే తపనతో పోలీసు ఉద్యోగాన్ని వదిలి అల్లం భాస్కర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బాధ్యతలను స్వీకరించారు. పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన భాస్కర్ ఇటీవల డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. బుధవారం దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట ప్రభుత్వ పాఠశాలకు ఆయనను అధికారులు నియమించారు. బాధ్యతలను స్వీకరించిన భాస్కర్‌ను పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోట వేణు, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

ఇచ్చోడ, అక్టోబర్ 16 : డీఎస్సీ–2024లో ఎంపికైన ఉపాధ్యాయులు సిరికొండ మండలంలో 14 మంది, ఇచ్చోడలో 14 మంది ఎంఈవోలు సునీల్, బిక్కుకు జైనింగ్ ఆర్డర్ కాపీ అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన కార్యదర్శి విజయ్, సీనియర్ ఉపాధ్యాయులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

భీంపూర్, అక్టోబర్16 : భీంపూర్ మండలంలోని ఆయా పాఠశాలల్లో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. కరంజి(టీ) ప్రాథమిక పాఠశాలలో ఇది వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు కూడా పోస్టింగ్ స్థానాలకు వెళ్లలేని పరిస్థితి. ఇప్పుడు ఈ పాఠశాలలో బుధవారం నలుగురు ఉపాధ్యాయులు విధు ల్లో చేరారు. 120 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

దస్తురాబాద్, అక్టోబర్ 16 : మండలానికి నూతనంగా ఎనిమిది మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. బుధవారం కాంప్లెక్స్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంఈవో గంగాధర్ వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 16 : ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఏడుగురు కొత్త ఉపాధ్యాయులను నియమించారు. బుధవారం ఆరుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ బోధన నిర్వహణ పత్రాలను స్వీకరించారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన వాసవి విద్యార్థులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 16 : నిర్మల్‌లోని వాసవి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ప్రపంచ ఆహార దినోత్సవాన్ని డవ్ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైల జాయ్‌సన్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని వారిని బాగా చూసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఉంచే పరిస్థితిని తీసుకురావద్దని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కుమ్రం భీం వర్ధంతి

బోథ్, అక్టోబర్ 16 : సొనాల గ్రామంలో గురువారం కుమ్రం భీం వర్ధంతి నిర్వహించనున్నట్లు పార్డి(బీ) రాయిసెంటర్ పరిధిలోని ఆదివాసులు తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసులు హాజరుకావాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి : 20 సంవత్సరాల జైలు శిక్ష

ఎదులాపురం, అక్టోబర్ 16 : ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో నేరస్తుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.7వేలు జరిమానా విధిస్తూ బుధవారం ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి శివరాంప్రసాద్ తీర్పు వెలువరిచినట్లు కోర్టు లైజన్ అధికారి పండరి తెలిపారు. కేసు వివరాలు వెల్లడించారు.. ఆదిలాబాద్‌లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన జమీల్‌ఖన్(25) అదేకాలనీలో ప్రత్యేకంగా అరబిక్ భాష నేర్పించడానికి వారి ఇండ్లకు వెళ్లేవాడు. 14 ఫిబ్రవరి 2021న సాయంత్రం జమిల్‌ఖాన్ తన ఇంటిలో ఫంక్షన్ ఉందని బాధితురాలి తల్లి, తండ్రిని ఒప్పించి బాలికను, 4 సంవత్సరాల తమ్ముడిని బైక్‌పై తీసుకెళ్లాడు. ఫంక్షన్ పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఆరేళ్ల బాలికను మర్గమధ్యంలో పొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అ సమయంలో బాలిక తమ్ముడికి ఫోన్ ఇచ్చి ఒక చోట కుర్చోబెట్టాడు. లైంగికదాడికి పాల్పడి వారి ఇద్దరిని ఇంటివద్ద దించేశాడు. తర్వాత బాలిక ఏడుస్తూ తల్లిదండ్రికి విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక వన్ టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ ఎస్ రామకృష్ణ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎన్ఎస్ఎస్పీ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పీపీ ముస్క రమణారెడ్డి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు అయింది. దీంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి పీ శివరాంప్రసాద్ తీర్పును వెలువరించారు.

గంజాయి పట్టివేత

ఎదులాపురం, అక్టోబర్ 16 : ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. మహాలక్ష్మివాడకు చెందిన రిజ్వాన్ ఖాన్, సాయితేజ మహారాష్ట్రలోని యావత్మాల్‌కు చెందిన సయ్యద్ అలీ వద్ద నుంచి 20 కిలో గంజాయి కొనుగోలు చేసి ఆదిలాబాద్‌లో విక్రయిస్తుండగా ఎస్ఐ విష్ణు ప్రకాశ్, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణ

బేల/తాంసి/భీంపూర్, అక్టోబర్ 16 : బేల, తాంసి, భీంపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయాల్లో బుధవారం మంచి నీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. పైప్‌లైన్ మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాల్లో బేలలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దేవయ్య, ఎంపీడీవో మహేందర్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతికుమార్, ఎంపీవో, తాంసిలో మిషన్ భగీరథ ఏఈఈ ప్రశాంత్, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, భీంపూర్‌లో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

బోథ్, అక్టోబర్ 16: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఎల్క రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల జాతి ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాలల జనాభా సంఖ్య తక్కువ చేసి చూకుండా ఖచ్చితమైన లెక్కలు తేల్చిన తర్వాత ముందుకెళ్లాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. మాలల జనాభా లెక్కలు –2024 ప్రకారం తేల్చిన తర్వాత వర్గీకరణ న్యాయంగా శాస్త్రీయంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ మునేశ్వర్ సోమన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి ఊశన్న పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

బోథ్, అక్టోబర్ 16 : సొనాల గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్లు ప్రారంభించామన్నారు. గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, అక్టోబర్ 16 : పిప్పల్‌ధరి మాజీ సర్పంచ్ బంధువులు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, మాజీ సర్పంచ్ విజయ్, మాజీ ఎంపీటీసీ దేవీదాస్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

భైంసా, అక్టోబర్ 16 : భైంసాలోని డబుల్ బెడ్రూం సమీపంలో విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా ఓ లైన్‌మెన్ ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నర్సాపూర్(జీ) మండలం తురాటి గ్రామానికి చెందిన పులి జైపాల్ భైంసా పట్టణ సబ్ స్టేషన్ పరిధిలో ఏఎల్ఎంగా పని చేస్తున్నాడు. బుధవారం మహాగాం రోడ్డులో డబుల్ బెడ్రూం గృహ సముదాయం సమీపంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తీగలు తగలడంతో తీవ్ర గాయాలై కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే పట్టణంలోని ఏరియా దవాఖానకు తరలించారు. 30 శాతం కాలిన గాయాలుండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ ఆదిత్య, లైన్‌మెన్లు దవాఖానకు చేరుకున్నారు.

బోథ్ నియోజకవర్గాభివృద్ధికి కృషి

బోథ్, అక్టోబర్ 16 : బోథ్ నియోజకవర్గాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అభివృద్ధి కోసం మరిన్ని ప్రతిపాదనలు అందజేయడం జరిగిందని, అవి కూడా త్వరలోనే మంజూరు అవుతాయని పేర్కొన్నారు. ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుని నిధులు మంజూరు చేసినందుకు ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రికి కృతజ్ఞతలు

బోథ్, అక్టోబర్ 16 : బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేసినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.100 కోట్లు విడుదలయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పనుల ప్రణాళికలు

నర్సాపూర్(జీ), అక్టోబర్ 16 : రాంపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో ఫార్మేషన్ రోడ్లు , పైపు కల్వర్టు నిర్మాణం, చిన్న ఊట కుంటల నిర్మాణానికి స్థలాల ఎంపికను బుధవారం టెక్నికల్ అసిస్టెంట్లు రవీందర్, సతీశ్ కలిసి సిబ్బందితో కొలతలు చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి మిగతా గ్రామాల ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మహ్మద్, నర్సయ్య, రాజ్, భోజన్న, రైతులు పాల్గొన్నారు.

ప్రణాళిక తయారు చేసుకోవాలి

ఇచ్చోడ, అక్టోబర్ 16: 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ ప్రణాళిక పనులను సిబ్బంది తయారు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించాలన్నారు. జాబ్‌కార్డు లేని వారికి జాబ్ కార్డులు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో నరేందర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పాగొట్టుకున్న సెల్‌ఫోన్ భక్తుడికి అందజేత

బాసర, అక్టోబర్ 16 : బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి బుధవారం బేగంపేటకు చెందిన ప్రదీప్ కుమార్ వచ్చాడు. దర్శనానంతరం అన్నసత్రంలో సెల్‌ఫోన్ మరిచిపోయాడు. అయితే అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు విజయ్‌కుమార్ గమనించి జూనియర్ అసిస్టెంట్ సాయిలుకు తెలిపారు. దీంతో వెంటనే భక్తుడిని గుర్తించి ఆయనకు సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా వారికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కుంటాల, అక్టోబర్, 16 : కుంటాల మండలం సేవాలాల్ గ్రామానికి చెందిన చవాన్ అరవింద్(28) బుధవారం ఉదయం 3 గంటలకు తన ఇంటిలోని రేకుల షెడ్డు వాసానికి చీర కొంగుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అరవింద్ మద్యానికి బానిసయ్యాడు. పని చేయకుండా ఖాళీగా ఉండడం వలన భార్యభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో తన భార్య పుట్టింటికి వెళ్లింది. బాధతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరవింద్ ఉరివేసుకున్నాడు. మృతునికి భార్య చవాన్ ఇందుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవురావ్ తెలిపారు.

అక్రమంగా మొరం తరలింపు వాహనం పట్టివేత

ముథోల్, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని బుధవారం పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరిపి తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఠాకూర్ కిష్టన్న

తలమడుగు, అక్టోబర్ 16: తలమడుగుకు చెందిన ఠాకూర్ కిష్టన్న 20 రోజుల నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఠాకూర్ కిష్టన్న 20 రోజుల క్రితం ఊరుకి వెళ్తానని వెళ్లి ఇప్పటి వరకు రాలేదు. తమ్ముడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజమ్మ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ కనబడితే కుటుంబ సభ్యులను గాని తలమడుగు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

ఇందిరమ్మ కమిటీలు ఏజెన్సీలు నిలిపివేయాలి

ఉట్నూర్, అక్టోబర్ 16: ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన కమిటీలను ఏజెన్సీలో అమలు చేయరాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికను పెసా కమిటీ, గిరిజన మహిళా సంఘాలతో పాటు సర్పంచ్, స్పెషల్ అధికారి ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులు భూములు కొనడం, అమ్మడం నిషేధమన్నారు. సమావేశంలో నాయకులు ఓమేశ్, దేవ్‌రావ్, ఆత్రం ధర్మ, ఇంద్రు పాల్గొన్నారు.

విద్యాబోధన మెరుగు పర్చాలి

ఉట్నూర్, అక్టోబర్ 16: విద్యార్థులకు విద్యాబోధన మరింత మెరుగు పర్చాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యాబోధన, సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

నార్నూర్, అక్టోబర్16 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు ఉన్నారు.

సిర్గాపూర్ గ్రామ పంచాయతీ తనిఖీ

దిలావర్‌పూర్, అక్టోబర్ 16 : సిర్గాపూర్ గ్రామ పంచాయతీని డీఎల్పీవో రమేశ్ బుధవారం తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇంటి పన్నులు చెల్లించిన వారి రసీద్ బుక్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ధరణిశ్రీకి నాట్య 'మయూరి' అవార్డు

కుభీర్, అక్టోబర్ 16 : కుభీర్‌కు చెందిన సాప ధరణిశ్రీకి నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ నాట్య మయూరి అవార్డును అందించారు. దసరా నవరాత్రి నృత్య మహోత్సవంలో భాగంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగిన నృత్య ప్రదర్శన కార్యక్రమంలో బుధవారం అద్భుతమైన తన ప్రదర్శనకు గాను అవార్డు, ప్రశంసా పత్రంతో సత్కరించారు. సొసైటీ వ్యవస్థాపకులు ఏకలవ్య–వీరేశ్ యాదవ్, సినీ ఆర్టిస్ట్ బాపనపల్లి వెంకటస్వామి అవార్డును అందించిన వారిలో ఉన్నారు.